పైడితల్లమ్మకు పుష్పాలంకరణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి దేవాలయంలో శ్రావణమాసం మొదటి మంగళవారం కావడంతో పట్టణంలో ఉన్న చదురు, వనం దేవాలయాల వద్ద విశేష పుష్పాలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాలనుండి భక్తులంతా ఉదయం నుండే విచ్చేశారు. ఇందులో భాగంగా మూడు లాంతర్ల వద్ద ఉన్న చదురు గుడిలో 46 మంది దంపతులతో పంచామృత అభిషేకాలు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డివి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవాలయం వద్దకు విచ్చేసిన భక్తులకు ఆలయ పూజారి బంటుపల్లి వెంకట్రావు, అర్చకులు ఏడిద వెంకటరమణ పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అసిస్టెంట్ కమిషనర్లు ఏడుకొండలు, మణికంఠ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు ప్రతిరోజు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కలసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లా కలెక్టర్ లు, పోలీస్ సూపరింటెండెంట్‌లతో అమరావతి సచివాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా బి ఆర్ అంబేద్కర్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్ చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ లను కలిశారు. జిల్లా కలెక్టర్ లు, ఎస్.పి.లకు ఏర్పాటు చేసిన విందు సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు సి.ఎం., డిప్యూటీ సి.ఎం.లను కలసి జిల్లా అభివృద్ధికి సంబంధించిన ముఖ్య విషయాలను వారితో చర్చించారు. జిల్లాకు సంబందించి శాంతి భద్రతల పరిస్థితి తదితర అంశాలపై వారికి జిల్లా కలెక్టర్, ఎస్.పి.లు వివరించారు.

రాత్రివేళ పెట్రోలింగు అధికారులను, సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయండి

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పట్టణంలోని పోలీసు కంట్రోల్ రూంను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సందర్శించారు. పోలీసు కంట్రోల్ రూంను, స్టేషను చుట్టూ ప్రాంగణాన్ని, పోలీసు క్వార్టర్సును పరిశీలించి, పోలీసే కంట్రోల్ రూం సిబ్బంది, అధికార్లు నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా నేరాలను నియంత్రిం చేందుకు పోలీసు అధికా రులు, సిబ్బంది చేపట్టే రాత్రి పెట్రోలింగు, గస్తీలను నిరంతరం పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి విధులను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా నియమించిన ఎలర్టింగ్ అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, గస్తీ సిబ్బందిని కూడా అప్రమత్తం చేసి, జిల్లాలో ఎక్కడా నేరాలు జరగకుండా చూడాలన్నారు. డయల్ 100, మహిళల భద్రతకు ఏర్పాటుచేసిన ఎస్.ఓ.ఎస్. కాల్స్ పనితీరును స్వయంగా పర్య వేక్షించారు. డయల్ 100 ఫిర్యాదులను సిబ్బంది ఏవిధంగా స్వీకరిస్తున్నది, సమాచారాన్ని ఎవరికి అందిస్తున్నది, ఎంత సమయంలో సంఘటనా స్థలంకు సంబంధిత పోలీసులు వెళ్ళుతున్నది, వారు తీసుకున్న చర్యలను ఎంత సేపటిలో తెలియజేస్తున్నదన్న విషయాలను డయల్ 100 సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డయల్ 100 రికార్డులను జిల్లా ఎస్పీ పరిశీలించారు. అదే విధంగా మహిళల భద్రతకు ప్రత్యేకంగా కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన ఎస్.ఓ.ఎస్. కాల్స్ పై తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకొని, ఆన్లైనులో నమోదైన కాల్సును, వాటిపై సంబంధిత పోలీసు అధికారులు తీసుకున్న చర్యలను జిల్లా ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. అదే విధంగా నివాస ప్రాంతాల నుండి ఏదైనా పనులపై దూర ప్రాంతాలకు వెళ్ళే సమయాల్లో వారి ఇండ్లలో దొంగతనాలు జరగకుండా పోలీసుశాఖ పర్యవేక్షం చేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్.హెచ్.ఎం.ఎస్. (లాక్డ్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టం) పని తీరును, ఎన్ని కెమెరాలు పనిచేస్తున్నది, ఏఏ ప్రాంతాల్లో కెమెరాలను అమర్చుతున్నది, వాటిని పోలీసు కంట్రోల్ రూం నుండి ఏవిధంగా పర్యవేక్షిస్తున్నది పోలీసు కంట్రోల్ రూం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీసు కంట్రోల్ రూం సిబ్బంది మరింత అప్రమత్తంగా పని చేయాలని, నేరాల నియంత్రణలో చురుకుగా వ్యవహరించాలని, ఏదైనా నేరం జరిగినట్లుగా ఫిర్యాదు అందిన వెంటనే ఇతర ప్రాంతాలను, స్టేషన్లను అప్రమత్తం చేసి, నేరస్థులు పట్టుబడే విధంగా కంట్రోల్ రూం సిబ్బంది పని చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సిఐ ఈ.నర్సింహమూర్తి, కంట్రోల్ రూం సిఐ రాజశేఖర్, కంట్రోల్ రూం ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

భీమసింగి కర్మాగార ఎం.డిగా సన్యాసినాయుడు

విశాలాంధ్ర-జామి: జిల్లాలోని ఐకైక సహకార చక్కెర కర్మాగారంగా పేరొందిన భీమసింగి శ్రీవిజయరామా సహకార చక్కెర కర్మాగారానికి ఎండిగా వేమలి సన్యాసినాయుడు నియమితులయ్యారు. ఇక్కడ ఇప్పటి వరకు పనిచేస్తున్న కె.ఆర్. విక్టర్ రాజు పదవీ విరమణ చేయడంతో చోడవరం చక్కెర కర్మాగారం ఎండిగా ఉన్న సన్యాసినాయుడుకు పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈమేరకు మంగళవారం సన్యాసినాయుడు భీమసింగి కర్మాగారంలో బాధ్యతలను స్వీకరించారు. అలాగే పదవీవిరమణ చేసిన విక్టర్ రాజును నూతన ఎండితోపాటు ఉద్యోగులు, సిబ్బంది కలిసి ఘనంగా సత్కరించారు. ఇదిలావుండగా ఎండిగా బాధ్యతలను స్వీకరించిన సన్యాసినాయుడు స్వగ్రామం జామి మండలంలోని జన్నివలస కావడం విశేషం. ఆయన తండ్రి జన్నివలస మాజీ సర్పంచ్, టీడీపీ నేత వేమలి అప్పలనాయుడు.

ఇంగిలాపల్లిలో రైతులకు విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-దత్తిరాజేరు: ఇంగిలాపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో ఈ ఖరీఫ్ సీజన్‌కు కావాలిసిన వరి, మొక్కజొన్న ఇతర పంటలకు సంబందించిన ఎరువులును తాడ్డి రవి, గాడి కృష్ణ చేతుల మీదుగా రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు కావలిసిన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల వద్ద సిద్ధంగాఉన్నాయని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరం కు మానాప్రగడ శేషశాయి స్మారక పురస్కారం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషల త్రివేణీ సంగమంగా గుర్తింపు పొందిన మానాప్రగడ శేషశాయి పేరిట పురస్కారాన్ని 2024 సంవత్సరంకు గాను డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరమ్‌ను ఎంపిక చేసినట్లు తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ శనివారం పురస్కారాన్ని ప్రదానం చేయనున్నామని తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడండి...

విశాలాంధ్ర-చీపురుపల్లి: పర్యావరణాన్ని కాపాడుతూ పండగ వాతావరణాన్ని నిర్వహించుకోవాలి అంటూ స్థానిక మానవీయత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులు పిలుపునిచ్చారు. రానున్న వినాయకచవితి వేడుకల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలు వద్దే వద్దు... మట్టి విగ్రహాలు వాడాలని ఆయన కోరారు. ఈ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రకరకాల రంగులతో విగ్రహాలు వలన చెరువులను కలుషితం చేసి మానవాళికి, నోరులేని జంతువులకు, పక్షులకు చేపలకు మొదలగు వాటికి మనం హాని కలిగిస్తున్నామన్నారు. అందుకేమరి పర్యావరణాన్ని పరిరక్షించుకోవటానికి మనం మట్టి విగ్రహాలను తయారు చేయవలసిందిగా కోరారు. మనం చేసే పనులు వల్ల ఇతరులకు హాని కలిగిస్తే, దైవ ప్రార్థనలు చేయటంతో ప్రాప్తి లభించదు ...సరి కదా మరింత పాపాన్ని మనం ఒడి కట్టుకుంటా మని అందుకే మన ఇళ్లల్లో అయితే పసుపు వినాయకుడును, బహిరంగప్రదేశంలో మట్టి వినాయకులను మాత్రమే పూజించ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత గా గుర్తు చేశారు.

మాతా శిశు మరణాలు పూర్తిగా తగ్గించాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర రావు

విశాలాంధ్ర-పూసపాటిరేగ : ఆశాడే సందర్భంగా పూసపాటిరేగలో సమావేశం జరిగింది. ఆశాలకు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. జూలై మాసం లో జిల్లాలో అత్యధిక ప్రసవాలు చేసినందుకు గాను వైద్యాధికారి కి సిబ్బందికి అభినందనలు తెలియజేసారు .ఈ సందర్భంగా పలు విషయాలను సమీక్షించారు మాతా శిశు మరణాలను 2027 నాటికి ప్రస్తుతం ఉన్న 60 నుండి 20 కి తగ్గించాలని ప్రతీ గర్భిణీ స్త్రీని 15 రోజులకొకసారి సందర్శించి తల్లులకు ఆరోగ్య పరిరక్షణ చర్యలుచేపట్టాలని సిబ్బందికి దిశ నిర్దేశంచేసారు. మాతా శిశు మరణాలను తగ్గించుటలో అందరూ కృషి చెయ్యాలని తెలియజేసారు. ఆగస్టు 20న జరగనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, ప్రభుత్వ ప్రయివేట్ కళాశాలలలో విద్యార్థులకు ఆల్బెండిజోల్ మాత్రలు మింగించాలని. ఏ ఒక్కరూ రక్తహీనతకు గురికాకుండా ఐరన్ మాత్రలు వేయించాలని తెలియజేసారు.పీహెచ్సి లలో సహజ ప్రసవాలు జరిగేలా గర్భిణీ లకు ప్రోత్స హించాలని, తల్లి పాల ప్రాముఖ్యతపై శిశ సంక్షేమ శాఖతో సమన్వయం అయి అవగాహన ఏర్పాటుచేయాలని తెలియజేశారు. జూలై మాసం లో జిల్లాలో అత్యధిక ప్రసవాలు నిర్వహించినందుకు వైద్యాధికారికి, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందించారు.సీజనల్ వ్యాధుల దృష్ట్యా మలేరియా, డెంగ్యూ వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలు గూర్చి అవగాహన కార్యక్రమాలు ప్రతి గ్రామాలలో ఏర్పాటు చేయాలని తెలియజేసారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడిమియా లాజిస్ట్ డాక్టర్ వెంకటేష్, వైద్యా ధికారి డాక్టర్ రాజేష్ వర్మ, జిల్లా వైద్య ఆరోగ్యాశాఖ కార్యాలయ సిబ్బంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు చంద్రశేఖర రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ ప్రేమ్ కుమార్, పీహెచ్‌సి సిబ్బంది వేదమని, ఆర్. వి. రమణ. మిడ్ లెవెల్ హెల్త్ ప్రోవైడర్ లు, ఏఎన్ఎం లు, ఆశా లు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ విద్యకు దరఖాస్తులు ఆహ్వానం

కోఆర్డినేటర్ సూరినారాయణ

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మండల విద్యాశాఖ అధికారి జె.త్రినాథ రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తాసిల్దార్ హేమంత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో అందరూ దృష్టి పెట్టి మధ్యలో చదువు విడిచిపెట్టిన వారిని ఓపెన్ స్కూల్లో డైరెక్ట్ గా పదో తరగతి, పదోతరగతి పాసైనవారు ఇంటర్మీడియట్‌లో చేర్చేందుకు మీ అందరూ ఆయన ఆదేశించారు. దీని ద్వారా అందరికీ చదువు అందించి పాస్ అయిన వారికి జీవనోపాధికి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఇన్చార్జ్ ఎంపీడీవో డివి అప్పారావు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ విధానం ద్వారా డ్రాప్ అవుట్ పిల్లల చదువుకు అవకాశం ఉంటుందని దీన్ని అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఐ సి డి ఎస్ పి ఓ కే రాజ్యలక్ష్మి, ఎంఈఓ2 ఆర్ పాపారావు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ జి సూర్యనారాయణ, సిబ్బంది, హెచ్ఎం, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాతో వృద్ధుడు మృతి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట మండలం బొడ్డవర పంచాయతీ చిట్టెంపాడు గ్రామానికి చెందినటువంటి సోము సన్యాసిరావు 70 సంవత్సరాలు కలిగినటువంటి గిరిజన వృద్ధుడు కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ డయారియా చికిత్స నిమిత్తం శృంగవరపుకోట సామాజిక ఆసుపత్రి యందు జాయిన్ అయి చికిత్స పొందుతూ మృతి చెందినటువంటి ఘటన చోటు చేసుకుంది గిరిజన ప్రాంతాలలో వైద్య సదుపాయాలు లేకపో వడం సరైన పరిశుభ్రత వాతావరణం ప్రభుత్వం కల్పించకపోవడంతో పదేపదే అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి ఇటీవల కాలంలో అదే గ్రామానికి చెందిన 20మంది చిన్నారులు చికిత్స పొంది ఇంటికి వెళ్ళిన విషయం మనకి తెలిసినదే ఇకనైనా తగిన అధికారులు ఈ విషయంపై స్పందించి రోడ్డు విద్యావైద్యం వంటి వ్యవస్థాపన సౌకర్యాల్ని కనీస వసతులను కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుమ్మకోట బస్సులో ఫుట్ బోర్డు బై వేలాడుతున్న విద్యార్థులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్ కోట మండల కేంద్రం ఎస్ కోట నుండి గుమ్మకోట వెళ్లేటువంటి ఏపీఎస్ఆర్టీసీ బస్సులో నిలుచడానికి కూడా స్థలం లేక విద్యార్థినే విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు ఈ సందర్భంలో విద్యార్థులు ఫుట్ బోర్డుపై నిల్చోని ప్రయాణం చేయవలసినటువంటి పరిస్థితి నెలకొన్నది ఏపీఎస్ఆర్టీసీ యందు గిరిజన ప్రాంతాలకు గుమ్మకోట భీం పోలు వెళ్లేటువంటి బస్సులు కొరత వల్లనే ఈ సమస్య నెలకొంటుందని అధికారులు స్పందించి బస్సులసంఖ్య పెంచాలని విద్యార్థులు కోరుకుంటున్నారు బస్సుల్లోనే ఫుట్ బోర్డు ప్రయాణం ప్రమాదకరమని రాసి ఉన్నప్పటికీ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు ఏపీఎస్ఆర్టీసీ అధికారులు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

హామీలు అమలుచేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి చింతల రామకృష్ణ

విశాలాంధ్ర-రామభద్రపురం: రాష్ట్రంలో ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ఏవైతే హామీలు ఇచ్చిందో ఆ హామీలను ఒక్కొక్క టిగా మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన అద్భుతంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వము ఏర్పడి 50 అయిందని అన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన 6 గ్యారంటీలలో ఒక్కొక్కటిగా అమలుచేయడం జరుగుతుందని అన్నారు. ఈ నెలాఖరికల్లా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యము కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని అన్నారు. చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్రము అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కరణం విజయభాస్కర్. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చింతల చిన్నమ్మ తల్లి మాస్టారు, మండల టిడిపి అధికార ప్రతినిధి బెవర చిన్నారావు, లు పాల్గొన్నారు.

రూరల్ సీఐ గా ఉపేంద్ర బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-రాజాం: ఈరోజు రాజాం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్? గా హెచ్. ఉపేంద్రరావు బాధ్యతలు స్వీకరించారు, ఇదివరకు ఎస్ కోట సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పనిచేసిన ఈయన, బదిలీ పై రాజాం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా వచ్చారు.

డ్రమ్ సీడర్ వాడకం ద్వారా రైతులకు మేలు

వ్యవసాయ సహాయ సంచాలకు ఏ నాగభూషణం

విశాలాంధ్ర-డెంకాడ: రైతులకు డ్రమ్ము సీడర్ వాడకం ద్వారా ఎక్కువగా లాభం జరుగుతుందని వ్యవసాయ సహాయ సహాయ సంచాలకులు ఏ నాగభూషణరావు అన్నారు మంగళవారం డి తాళ్లవలస గ్రామంలో రమణ రైతు పొలం సందర్శించి దాని పనితీరును రైతులకు వివరించారు ఈ సందర్భంగా డ్రమ్ముస్ సీడర్ పద్ధతిలో ఒక ఎకరా విత్తె రని విత్తనానికి కేవలం ఇద్దరు కూలీలు సరిపోతారని 1 డ్రం సీడర్ లాగటానికి 1 మనిషి గింజలు నింపటానికి తాడు మార్చటానికి అవసరం అవుతుందని అలాగే రకాన్ని బట్టి ఎకరాకు 13-15 కిలోలు అవసరం అయితుందని ఒక ఎకరా విత్తటానికి సాధారణంగా 120 నిమిషాల టైం (2 గంటలు) సరిపోతుందని ఒక రోజులో ఒక యూనిట్లో మూడు ఎకరాలు విత్తుకోవచ్చు అని తెలిపారు సాధారణ పద్ధతిలో పోలిస్తే డ్రం సీడర్ పద్ధతిలో 10 నుండి 15 శాతం అధిక దిగుబడి వస్తుందని రైతుకు సాధారణ దిగుబడి వచ్చిన రైతుకు ఈ పద్ధతిలో నారుమడి పెంపకం నారు పీకటం నాట్లు వేసే పనులపై ఖర్చు తగ్గుతుంద కాబట్టి అధిక నికర ఆదాయం వస్తుందని కావున రైతులు డ్రమ్ము సీడర్ ద్వారా విత్తి వరి కోత యంత్రం ఉపయోగించి పంటను సాగు చేసినట్లయిత వరిసాగులో బాగా ఖర్చులు తగ్గి అధిక నికర ఆదాయం పొందవచ్చునని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈ నిర్మల వి ఏ ఏ సౌమ్య మాజీ జడ్పిటిసి పతివాడ అప్పలనాయుడు రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త వహించాలి

వైద్యాధికారిణి ధరణి

విశాలాంధ్ర-వేపాడ: ప్రస్తుత సీజన్ వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు రాకుండా విద్యార్థినిలు జాగ్రత్త వహించాలని వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఏ. ధరణి సూచించారు. మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కు నాయుడు పేటలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం వైద్యాధికారిణి ఏ. ధరణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మి, సి హెచ్ ఓ ఆంజనేయులు, వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మైనర్ పై అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాలు జైలు

విశాలాంధ్ర-రామభద్రపురం: మండలంలోని రొంపిల్లి గ్రామానికి చెందిన భవిరెడ్డి రవితేజ పై 2021 సంవత్సరం10 వ నెలలో అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారం చేసాడని ఆరోపణతో బాలిక కుటుంబ సభ్యులుస్థానిక పోలీస్ స్టేషన్లో రవితేజ పై ఫోక్ షో కేసు పెట్టారు. మూడు సంవత్సరాలు విచారణ అనంతరం విజయనగరం ఫోక్సో కోర్టులో న్యాయమూర్తి కే నాగమణి నిందితుడికి 20 సంవత్సరాలు జైలు శిక్ష, అలాగే 6000 రూపాయలు జరిమన విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారని స్థానిక ఎస్సై జ్ఞాన ప్రసాద్ తెలిపారు.

పట్టణ సుందరీకరణకు ప్రజలు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణ ప్రజలు పట్టణ సుందరీకరణకు సహకరించాలని, తడి చెత్త పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య వాహనాలకు అందించాలని, విచ్చలవిడిగా చెత్తను వేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ శివ కుమార్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు మరియు వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో పూల్ బాగ్ జంగాల వీధి రోడ్డు మరియు యాత వీధి ఏరియాలలో పర్యటించారు.యాత వీధిలో ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించి కాలువలలో సిల్ట్ తీయు పనులను పరిశీలించారు. పూల్ బాగ్ ఏరియాలో రోడ్ల పైన చెత్త లను వేస్తున్న వారిని గుర్తించి వారికి నేరుగా మున్సిపల్ వాహనానికి చెత్త లను అందించాల్సిందిగా తెలియజేయాలని వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ కి ఆదేశించారు. పూల్ బాగ్ లో గల అపార్ట్మెంట్లో జరుగుతున్న ఆన్ సైట్ కంపోస్టింగ్ను పరిశీలించి వారికి సూచనలు జారీ చేశారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధమే!

మాల మహానాడు మండల అధ్యక్షుడు దేబార్కి కిరణ్

విశాలాంధ్ర-వేపాడ : ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, ఆర్టికల్ 314ను ప్రశ్నించేలా ఉందని మండల మాల మహానాడు అధ్యక్షులు దేబార్కి కిరణ్ అన్నారు. మండల కేంద్రమైన వేపాడలో రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి తమ నిరసనను వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లా డుతూ షెడ్యూల్ కులాల జాబితాను మార్చే అధికారం రాష్ట్రపతికి మాత్రమే ఉందన్నారు. పార్లమెంటు, అసెంబ్లీలలో నాలుగింట మూడు వంతులు మెజారిటీతోనే ఇది సాధ్యమవుతుందన్నారు. కానీ సుప్రీం కోర్టు తీర్పు రాష్ట్రాలకే నేరుగా అధికారం కట్టబెట్టేలా ఉందన్నారు. ఇది దేశ సమగ్రతకు విఘాతం కలుగుతుందన్నారు. పైగా ఈ తీర్పుగా రాష్ట్రంలో వర్గీకరణ చట్టం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు.దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, త్వరలో రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు చేపట్టబోయే కార్యచరణకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కదారి అప్పారావు, కోరుపోలు గంగరాజు, డోలు నాగేష్, దేబార్కి ఆనంద్, దేబార్కి రవి, కెర్రీ దేముడు, పోడుగు మధు, నల్ల ప్రదీప్, పొడుగు అప్పారావు, వెలగాడ మరియదాసు, దేబార్కి నరేంద్ర, గట్టు వెంకన్న, ఎం.శంకర్, కుదర చైతన్య, చెలికాని బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

మెంతిపేట ఎస్సీ కాలనీలో కమిషనర్ పర్యటన

విశాలాంధ్ర-రాజాం: రాజాం మున్సిపాలిటీ పరిధిలో వార్డులు పర్యటనలో భాగంగా మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు మంగళవారం ఎస్సీ మెంతిపేట కాలనీ వార్డులో కాలువలు, శానిటేషన్ పై తనిఖీలు నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులకు తెలిపారు. కమిషనర్ వెంట సానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ ప్రసాద్, సానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్

డిఎస్పి గోవిందరావు

విశాలాంధ్ర-జామి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విజయనగరం డిఎస్పి ఆర్.గోవిందరావు సూచించారు. మంగళవారం మండలం లోని భీమసింగి లో ఉన్న శ్రీ బాలాజీ విద్యాసంస్థల విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ప్రస్తుతం యువత మత్తు పదార్థాలు వైపు ఆకర్షితులవుతున్నారని, విద్యాభ్యాసన దశలో ఇటువంటి దురాలవాట్లకు బానిసలు కావద్దని ఆయన సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వీటితోపాటు ఫోక్సో చట్టంపై విద్యార్థులకు వివరించారు. సైబర్ క్రైమ్ గురించి పలు విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జామి ఎస్ఐ వీరబాబు, బాలాజీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం పాఠశాలలో ఆటలపోటీలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రానన్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్క రించుకుని పాఠశాలలో విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం బంగారు ఉమామహేశ్వర రావు గారు బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలను ఇతర ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభిం చినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, లోకి రెడ్డి కృష్ణలు తెలిపారు. శ్రీరాములు మాట్లాడుతూ క్రీడాకారులు అత్యంత ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొంటూ వారి ఉత్సాహానికి అవదులుల్లేవు అని అన్నారు. బుధవారం ఉదయం కోకో, క్రికెట్ ,అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని శ్రీరాములు తెలిపారు.

వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పట్టణంలోని నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో నియోజకవర్గం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు పాల్గొన్నారు ముందుగా ఎంఎస్ఎన్ కాలనీ వద్ద ఉన్న ఇంటర్మీడియట్ కళాశాల వద్ద ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు టెక్స్ బుక్స్, నోట్ బుక్స్, లను ఇవ్వాలని ఎన్డీయే ప్రభ్యాగ్భుత్వం నూతనంగా తీసుకున్న నిర్ణయం మేరకు విద్యార్థులకు బుక్స్, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో క్లాస్ రూమ్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డు ను ప్రారంభించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. విద్యార్థులంతా చక్కగా చదివి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని తెలిపారు. అనంతరం మహారాజ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వీల్ చైర్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. తదుపరి ఆసుపత్రిలో జనరల్ వార్డులను సందర్శించారు, అదేవిధంగా ఆసుపత్రిలో గల సమస్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ ఛైర్మన్ పూసపాటి అశోక్ గజపతి రాజు ఆదేశాల మేరకు రైల్వేస్టేషన్ ఎదురుగా గల శ్రీ పైడితల్లి అమ్మవారి కోవెల లో మంగళవారం నుండి నిర్వహిస్తున్న నిత్య అన్నదానం కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు జరిగే నిత్యఅన్నదాన కార్యక్రమాన్ని భక్తులంతా వినియోగించుకోవాలన్నారు.

శిశువు పుట్టిన వెంటనే తల్లి ముర్రిపాలు ఇచ్చే విధంగా అవగాహన కల్పించాలి

రెవెన్యూ డివిజనల్ అధికారి సాయిశ్రీ

విశాలాంధ్ర-బొబ్బిలి : తల్లులు శిశువునకు ముర్రిపాలు ఇచ్చే విధంగా అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు, సూపర్వైజర్లు అవగాహన కల్పించాలని రెవిన్యూ డివిజనల్ అధికారిణి ఏ సాయిశ్రీ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణం ఐసిడిఎస్ పట్టణ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు ముగింపు కార్యక్రమం పట్టణ సీడీపీఓ జాగాన విజయలక్ష్మి అధ్యక్షతన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెవెన్యూ డివిజనల్ అధికారి సాయిశ్రీ, మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఐసిడిఎస్ సిడిపిఓ జాగాన విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లి మురిపాలు ప్రాముఖ్యత పైన సిబ్బందికి అవగాహన కల్పించారు. పుట్టగానే శిశువుకు తల్లిపాలు తాగించాలని, ఆరునెలల దాటిన తర్వాత శిశువు కు అదనపు ఆహారం తప్పకుండా అందించాలని,రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు ఇచ్చే విధంగా అంగన్వాడి సిబ్బంది గర్భిణీలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ వైద్య అధికారి సంతోషి కుమారి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలకు వచ్చే గర్భిణీలకు, బాలింతలకు తల్లి మురిపాలులో అనేక పోషకవిలువలు ఉంటాయని అవగాహన కల్పించారు. అనంతరం పలువురు గర్భిణీలకు సీమంతాలు రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి శ్రీ, మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రవికుమార్, అంగన్వాడి సూపర్వైజర్లు ఎస్ కృష్ణవేణి ఎస్ ప్రభావతి,అదిక సంఖ్యలో అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తొలగించండి

ఇవోపిఆర్‌డికి మాజీ సర్పంచ్ త్రివేణి వినతి

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని పలు ప్రాంతాలలో తాగునీటి ఇబ్బందులను ప్రజలు ఎదుర్కొంటున్నారని, తక్షణమే పరిష్కరించాలని మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకటత్రివేణి మంగళవారం ఇవోపిఆర్‌డి శ్రీదేవిని కోరారు. ఈమేరకు ఆమె వినతి పత్రం అందజేసారు. గ్రామంలోని దొండపర్తినుంచి అబ్బులు కళ్లాలు వరకు గతకొంత కాలంగా తాగునీటి సరఫరా జరగడం లేదన్నారు. అలాగే రెల్లిపేట, బిసి కాలనీలకు ఒక్కపూట నీరు ఇవ్వడంతో వారికి చాలడం లేదని, రెండుపూటలా తాగునీటి ఇవ్వాలని కోరారు. అలాగే గ్రామంలో సరఫరా అవుతున్న తాగునీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ బొట్ట రమణ, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు చర్యలు

విశాలాంధ్ర-బాడంగి: మండలం కోడూరు. గ్రామంలో బంగారు నాయుడు మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ కొరకు అగ్నాస్త్రం తయారీ చేయడం జరిగిందని వ్యవసాయ అధికారి శిరీష. తెలిపారు.అగ్నస్త్రం తయారీకి కావలసిన పదార్థాలు .10 కేజీలు వేపాకు, కేజీ పొగాకు,అర కేజీ వెల్లుల్లి, పేర్చి మిర్చి,10 లీటర్ల గో మూత్రం తో ఆగ్నస్తం తయారి చేసుకొని పంట పై పిచికారి చేయాలన్నారు. పై చెప్పిన పదార్థాలు అన్ని వేరు వేరుగా ముద్దగా చేసి ఒక పాత్ర తీసుకొని అందులో 10 లీటర్ల ఆవు మూత్రం వేసి ఈ మధ్య చేసిన చూర్ణాన్ని అందులో వేసి నాలుగు పొంగులు వచ్చేవరకు మరిగించాలి ఈ మరిగిన మిశ్రమాన్ని 24 గంటలు చల్లారిన తర్వాత పంటకి పిచికారి చేసుకోవాలన్నారు .పురుగు నివారణ కి కాండం తో పురుగు అలాగే కాయ తోలుచే పురుగు నివారణ కి అగ్నా స్త్రం అనేది చాలా మంచిగా పని చేస్తుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో మం.టి.తులసి, ఎల్.ఈశ్వర రావు.సుభద్ర తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

డ్రోన్ల సహాయంతో మందులను పిచికారీ చేస్తే లాభదాయకం

విశాలాంధ్ర-జామి: రైతులు తమ పంటపొలాలకు పురుగుల మందులను పిచికారీ చేసేందుకు నూతన యాంత్రీకరణ విదానంను వినియోగిస్తే లాభదాయకమని మండల వ్యవసాయాధికారి పి. కిరణ్‌కుమార్ అన్నారు. డ్రోన్ సహాయంతో పురుగుల మందులను పిచికారీ చేసే విదానాన్ని ఆయన సోమవారం పొలాల్లో రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈసందర్భంగా డ్రోన్ వలన కలిగే లాభాలను రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో కూలీల సహాయం లేకుండా నిర్వహించవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబుతోపాటు పలువురు రైతులు, వ్యవసాయ సహాయకులు అహమ్మద్, అలేఖ్య, ఉషా తదితరులు పాల్గొన్నారు.

కాగాం డీలర్ గుండెపోటుతో మరణం

విశాలాంధ్ర-తెర్లాం: మండల పరిధిలోనీ కాగాం గ్రామానికి చెందిన డీలర్ జిల్లేల. తౌడు(70) సోమవారం రాత్రి గుండె పోటుతో మరణించినట్టు కుటుంబీకులు ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి భోజనం చేసి పడుకొని నిద్రిస్తున్న సమయంలో అతను గుండెపోటు గురయ్యారు. గత సుమారుగా 30 ఏళ్ల కు పైగా రేషన్ డిపో డీలర్ గా పనిచేస్తూ వస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలు క్రితం బియ్యం తూస్తుండగా బస్తా కాలు మీద పడి విరిగిపోయి బాధపడుతూ వస్తున్నారు. గ్రామం లో మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తిగా గుర్తిపు తెచ్చుకున్నారు.అటు ప్రజల తోను ఇటు అధికారుల తోని మంచి మనిషిగా ఉంటూ విధి వ సాత్ మరణానికి గురయ్యారు. ఇతనికి భార్య నలుగురు పిల్లలు అన్నారు. ఇతని మరణ వార్త విన్న తహశీల్దార్ కే.హేమంత్ కుమార్, సిఎస్‌డిటి స్వర్ణలత తన ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు. అలాగే రెవెన్యూ ఉద్యోగులు, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యన్నారాయణ, నడిమింటి తిరుపతి, నల్ల.అది నాయుడు, సాగిరాజు శ్రీనివాసరాజు సంఘ సభ్యులు, జిల్లా సంఘం సభ్యులు, ఎం.ఎల్.ఎస్ పాయంటు ఉద్యోగులు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి సంతాపం తెలిపారు.

విద్యార్థులు విద్యా మెళకువలపై దృష్టి సారించాలి

ఎంఈఓ జగదీశ్వర రావు

విశాలాంధ్ర-వేపాడ: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరూ విద్యా మెలిక వలపై దృష్టిసారించాలని ఎంఈఓ జి.జగదీ శ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని చినదుంగాడ, కడకొండ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాలను పరిశీలించారు.అలాగే మరుగుదొడ్లను పరిశీలించి రోజులో నాలుగు సార్లు శుభ్రపరచాలని మంచి హైజినిక్ గా ఉంచాలని తెలియజేశారు. కడకండలో శిధిలావస్తలో వున్న తరగతి గదిని పరిశీలించంగా పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకొని తుఫానుల ప్రభావంతో వర్షల కారణంగా భవనం కారిపోవడం గమనించారు. అలాగే పాఠశాల రెండు తరగతి గదులు మంచి టి ఎల్ ఎం తో, గోడ పత్రికలతో పాఠశాల నిర్వహణకు సంబంధించిన టైం టేబుల్స్ తో ఆకర్షణీయంగా ఉండడంతో ఉపాధ్యాయుడు ఆర్. చల్లంనాయుడుని అభినందించారు. ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్లు పరిశీలించారు.తరగతి గదికి వెళ్లే ముందు తప్పనిసరిగా ఆపాఠంనకు,సంబంధించినటువంటి లెసన్ ప్లానో విద్యార్థులకు చక్కని టిఎల్ఎంతో పాఠం బోధించాలని తెలియజేశారు. విద్యార్థుల సామర్థ్యాల పరిశీలనలో 5వ తరగతి విద్యార్థులతో పాటు ఆయా తరగతుల విద్యార్థులకు తెలుగు,ఇంగ్లీష్, గణితం చతుర్విధ ప్రక్రియలను పరిశీలించారు. పీఎం పోషణ మధ్యాహ్న భోజన పథకం మెనూని పరిశీలించి, రుచి చూసి, సంతృప్తిని వ్యక్తపరిచారు.

డివైడర్ సూచి బోర్డులు లేక తీవ్రస్థాయిలో ప్రమాదాలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణ కేంద్రంలో విశాఖపట్నం నుండి ఎస్.కోట వస్తున్న సందర్భంలో సాయిబాబా గుడికి ఎదురుగా ఉన్నటువంటి డివైడర్ సూచి బోర్డు లేకపోవడంతో డివైడర్ ని కనుగొనక వాహనదారులు డివైడర్ ని వాహనాలు ఎక్కిస్తున్నటువంటి పరిస్థితి నెలకొన్నది ఈ విషయంలో తాగిన అధికారులు స్పందించి సూచి బోర్డులను ఏర్పాటుచేసి వాహనదారులను ప్రమాదాలనుండి తప్పించవలసిందిగా వాహనదారులు కోరుతున్నారు.

ఆర్యవైశ్యులు సమాజసేవకులు...

సంఘ గౌరవ అధ్యక్షులు కోలగట్ల వీరభద్రస్వామి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రతిఒక్కరూ సమాజాహితాన్ని కోరుకుంటూ తాను సంపాదించిన దానిలో కొంత భాగాన్ని సమాజ సేవకు వినియోగించాలని ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలో ఏర్పాటు చేసిన పూర్వ అధ్యక్షుల చిత్రపటాలను కోలగట్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సమాజ సేవకులని, ఏ కార్యక్రమం చేపట్టిన స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయపడతారన్నారు. ఆర్యవైశ్య సంఘం పూర్వ అధ్యక్షుల ఫోటోలు సంఘం భవనంలో ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. పెద్దలు,మహనీయులను ఎల్లప్పుడూ స్మరిస్తూ వారి అడుగుజాడల్లో అందరం నడవాలని కోరారు. సంఘం అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ 1934 సంవత్సరంలో స్థాపించిన సంఘం 90 సంవత్సరంలో అడుగుపెట్టినట్టు చెప్పారు. కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్తా మాట్లాడుతూ 26మంది అధ్యక్షుల ఫోటోలు నెలకొల్పడం వారి కుటుంబ సభ్యులకు ఈ సమావేశంలో స్థానం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కోశాధికారి విజ్జపు వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘం ద్వారా ప్రతినెలా పేదలకు బియ్యం పంపిణీ, సంక్రాంతికి నిత్యావసర వస్తువులు, మహిళలకు చీరలు,బట్టలు, కార్తీకమాసంలో 10వేల మందికి అన్నసమారాధన నిర్వహించడం, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బలభద్రుని నానాజీ,ఏడుకొండలు, రాంజీ,మండవిల్లి వెంకటరాజు,తవ్వా మోహనరావు, పెంటపాటి కామరాజు,బొడ్డు సత్యనారాయణ, డిమ్స్ రాజు,గుంపిన నారాయణరావు,గూడూరు నరసింగరావు, ఉపేంద్ర, బుద్దేపు వెంకటరావు, ఆకి సూర్య ప్రకాశరావు,వజ్రపు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంవిజీఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ర్యాగింగ్ నిర్మూలన అంశంపై అవగాహన

విశాలాంధ్ర-డెంకాడ: ఎం.వి.జీ.ఆర్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్, జిల్లా పోలీసు అథారిటీ, విజయనగరం, కళాశాల ఆవరణలో ఇంజనీరింగ్ విద్యార్థులపై ర్యాగింగ్ నిర్మూలన మరియు ర్యాగింగ్ ప్రభావంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా భోగాపురం సి.ఐ జి.రామకృష్ణ, ఎస్.ఐ శ్రీ.ఎస్.కృష్ణ మూర్తి, డెంకాడ పాల్గొన్నారు. ముఖ్యఅతిథి జి రామ కృష్ణ మాట్లాడుతూ ఎం.వి.జి.ఆర్ క్యాంపస్‌లో ర్యాగింగ్ పాల్పడకుండా ఎం.వి.జి.ఆర్ క్యాంపస్‌ను ర్యాగింగ్ ఫ్రీగా తీర్చిదిద్దినందుకు యాజమాన్యాన్ని అభినందించారు. ర్యాగింగ్‌లో అవమానించడం, ఆటపట్టించడం, అవమానించడం, వేధింపులు ఉంటాయని ఆయన అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు ఇంజనీరింగ్‌లో చేరడమే లక్ష్యంగా పని చేయాలని, ఎలాంటి ర్యాగింగ్‌లకు పాల్పడవద్దని సూచించారు. క్యాంపస్‌లో ఎలాంటి ర్యాగింగ్ కార్యకలాపాలు జరిగినా ఫిర్యాదు చేసేందుకు 100, 112 టోల్ ఫ్రీ నంబర్లను వినియోగించుకోవాలని విద్యార్థులందరికీ తెలియజేసారు. ఎం.వి.జి.ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. సీతారామరాజు ప్రసంగిస్తూ ర్యాగింగ్ అనేది ఒక రకమైన శాడిజం అని, విద్యార్థులకు పరిచయం కోసం ర్యాగింగ్‌ను మాధ్యమంగా వినియోగిస్తున్నారని అన్నారు. క్యాంపస్‌లో సీనియర్లు మరియు జూనియర్‌లందరూ కొత్త విషయాలను అవలంబించడం ద్వారా ఆరోగ్యకరమైన సంబంధాన్ని కొనసాగించాలని మరియు మంచి వ్యక్తులుగా మంచి ఉదాహరణగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం డైరెక్టర్ పి. సీతారామరాజు, భోగాపురం సి.ఐ శ్రీ.జి.రామకృష్ణ, ఎం.వి.జి.ఆర్ సిబ్బంది యాంటీ ర్యాగింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎం.వీ.జీ.ఆర్ ఎన్.ఎస్.ఎస్ఎన్.సి.సి యాంటీ ర్యాగింగ్ కోఆర్డినేటర్, డా.ఎం.అనిల్ ప్రకాష్, ఎన్.ఎస్.ఎస్ పీఓ శ్రీ ఎన్ షణ్ముఖరావు, ఎం.వీ.జీ.ఆర్ సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందనలు తెలిపిన జనసేన నాయకులు బాబు పాలూరి

విశాలాంధ్ర-బొబ్బిలి: నియోజకవర్గం లో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని యజ్ఞం లా భావించి విజవంతం చేసిన క్రియా వాలంటీర్లుకు, జనసేన నాయకులకు, వీరమహిళలకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గత సంవత్సరం 2500 మంది సభ్యత్వం తీసుకున్నారని, ఈ ఏడాది గౌరవ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ స్థానిక నాయకత్వంపై నమ్మకంతో 4300 మంది సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో మా నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేసారని కొనియాడారు. ప్రజలు గ్రామాల్లో ఉన్న సమస్యలు మా కూటమి పార్టీల దృష్టికి తీసుకొస్తే, తక్షణ పరిష్కారం కొరకు కృషి చేస్తామని తెలిపారు. ఇదే ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు సంచాన గంగాధర్, తెర్లాం మండల అధ్యక్షులు మరడాన రవి, రామభద్రపురం మండల అధ్యక్షుడు బవిరెడ్డి మహేష్, నాయకులు రేవళ్ల కిరణ్, దిబ్బ కళ్యాణ్, కనకాల శ్యాం, అల్లు రమేష్, వెంకటరమణ, ప్రశాంత్, కొరగంజి సాయి, శ్రీనివాస్, పవన్ మరియు వీరమహిళలు గైనెడి రమ్య, భద్రగిరి సత్య, యందవ యామిని పాల్గొన్నారు.

అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలి

విశాలాంధ్ర-జామి: రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్, వీఆర్ఓ పోస్టులకు అర్హులైన విఆర్ఏలకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయాలని మండల వీఆర్ఏల సంఘం డిమాండ్ చేసింది. అందులో భాగంగా మంగళవారం స్థానిక తాసిల్దార్ కృష్ణలతకు తమ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు ఆర్.అప్పలరాజు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రాత్రిపూట విధులు నిర్వహించే జీవోను రద్దుచేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో అమలులో ఉన్న పే స్కేల్ ను ఇక్కడ కూడా అమలు చేయాలన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఏలను గుర్తించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో పి.అవతారం, ఐ శివ,ఎల్. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసి ఎన్నికలలో ప్రధాన ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండండి : ఎంఈఓ త్రినాధరావు

విశాలాంధ్ర-తెర్లాం : ఈనెల 8వ తేదీన మండలంలో ఉన్న 67 పాఠశాలలలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రధానోపా ధ్యాయులు అప్రమత్తంగా మండల విద్యాశాఖ అధికారి జె త్రినాధ రావు అన్నారు. మంగళవారం మండల పరి షత్ సమావేశ భవనంలో ప్రధానో పాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు తో సమావేశం నిర్వహించారు. సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ స్కూల్లో జరిగే ఎస్ఎంసి ఎన్నికలకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో డివి అప్పారావు, ఎంఈఓ 2 ఆర్ పాపారావు, స్థానిక ఎస్సై ఆర్ రమేష్, పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన భోగాపురం సిఐ రామకృష్ణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : భోగాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ గాబాధ్యతలు చేపట్టిన జి.రామకృష్ణ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్ ను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ భోగాపురం సర్కిల్ పరిధిలో నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల పట్ల కు దిశా నిర్దేశం చేసారు.

డ్యాం కు పబ్లిక్ ఆక్షనా! ఎన్నికలా?

విశాలాంధ్ర-వంగర: మద్దువలస చేపల డ్యాంకు ఫిషరీస్ అధికారులు బహిరంగ వేలం వేయటానికి మొగ్గుచూపుతున్నారు. వేలం వేస్తే లీజు సమస్య ఉండదని భావిస్తూ, అధికారులు భహిరంగవేలం వేయనున్నట్లు ప్రకటించినట్లు తెలిసింది. మద్దువలస డ్యాం ప్రారంభం నుండి మత్స్య సంపద కోసం డ్యాం ను కొట్టిశ ఫిషరీస్ సొసైటీలో చేర్పించారు. గత 20 ఏళ్లుగా సొసైటీలో చేరిన ఈ మద్దువలస చేపల డ్యాం సొసైటీఆధ్వర్యంలో ప్రతీ సవ్వత్సరంలీజు చెల్లిస్తూ సొసైటీకార్యవర్గం ద్వారా డ్యాంలో ఉన్నటువంటి పలు రకాల మత్స్యసంపద నువేటలులుచేసి దాంతోఅధికా లభాలుపొందుతూ వస్తున్నారు.ఇలా వస్తున్న తరుణంలో గత మూడేళ్లుగా కొట్టిశ ఫిషర్మెన్ సొసైటీ కార్యవర్గం మూడు ఫసలీలకు సంబంధించిన 1431, 1432, 1433 వ ఫసలీల లీజు సొమ్ము సుమారుగా రూ.42.50లక్షల వరకూచెల్లించకుండా ఎగ నామం పెట్టారు. దీంతో ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కావడం వల్లనే సంబంధిత అధికారులు ఇలాంటి నిర్ణయాలుతీసు కునే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు ఓపెన్ ఆక్షన్ వేసేందుకు నిర్ణయం తీసుకొన్నట్లు కనిపిస్తుంది. దీనికి కొట్టిశ సొసైటీ సభ్యులు మాత్రం అంగీంకక రిస్తారా? అంగీకరించరానన్నది తెలియరావటం లేదు.దీనికి సొసైటీ సభ్యులు రించ రన్నదితెలిసింది. జూలై 14 నే మండలంలో గల కొట్టిష శ్రీ సీతారామ సొసైటీ సభ్యులు ఫిషకొంత మంది మాత్రం ఫిషరీస్ సొసైటీ ఎన్నికల జరిపించకపోవటానికి గలకారణాలు తెలపాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు. పాత పాలక పక్షం సమయం పూర్తయి నేటికి నెలదినాలు కావస్తున్నా ఎన్నికలు జరిపించక పోవటానికి గలకారణాలు ఏంటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికలు జరిపితే లీజు నిధులు సక్రమంగా చెల్లిస్తారో, లేదోనని సంబంధిత అధికారులు ఇలా కాలయాపన చేసి బహిరంగ వేలంవేసే ఆలోచనలోఉన్నట్లు కనిపిస్తుంది. కొట్టిశ ఫిషరీస్ సొసైటీ వారు ఈ చేపలడ్యాం కుపేనాడు కూడా సకాలంలో సక్రమంగా లీజు చెల్లించిన దాఖలాల్లేవన్నది చెప్పకతప్పదు. సొసైటీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా రాష్ట్రం లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా అధికార పార్టీ వైపు కొత్త కార్యవర్గం గెలుపొందడం,వారుసకాలంలో ప్రభుత్వానికి చెల్లించవలసిన లీజు సొమ్ము సకాలంలో సక్రమంగా చెల్లించక పోవటం,సకాలంలో లీజు చెల్లించాలని సంబంధితఅధికారులు సొసైటీ వారిపై ఒత్తిడి తెస్తే, వారి పై అధికారపార్టీ నేతలు వారికి హుకుం జారీ చేయటం తదితర కారణాలు వల్ల అధికారులు లీజు చెల్లించని వారిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవటం వల్ల ప్రభుత్వానికి చేరవలసిన నిధులు సకాలంలో చేరవు. చేరుతాయో, లేదో తెలియని పరిస్తితి ఉండటం పరిపాటే. ప్రస్తుతం జూలై 14 తో గడువుపూర్తయిన సొసైటీ కార్యవర్గం సుమారుగా రూ.42.50 లక్షలు వరకూ ప్రభుత్వానికి చేరవలసినలీజు నిధులు చెల్లించకపోవటంఅన్నది కూడా ఈ చేపల డ్యాంకు భహిరంగ వేలంవేయటానికి నిర్ణయం తీసుకోవటానికి పెద్ద కారణంగాచెప్పకతప్పదు.

మైదానం అభివృద్ధికి కృషి

మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు

విశాలాంధ్ర- చీపురు పల్లి: చీపురుపల్లి జివిఆర్ ప్రభుత్వ కళాశాలలో క్రీడా మైదానం అభివృద్ధికి తన వంతు కృషి జరుపుతానని మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు హామీ ఇచ్చారు. గత 15 సంవత్సరాలుగా క్రీడా మైదానంలో జరుగుతున్న ఇండియన్ ఆర్మీ,నేవి,పోలీస్, తదితర శిక్షణ తరగతులను మంగళవారం నాడు గద్దె పరిశీలించారు.ఈ సందర్భంగా క్రీడా మైదానంలో శిక్షణ పొందుతున్న యువతి యువకులకు తనవంతుగా టీ షర్టులను బహుకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తీసుకుంటున్న యువతకు అవసరమైన మౌలిక వసతులతో పాటు క్రీడా మైదానం అభివృద్ధికి తన వంతు కృషి జరుపుతానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా యువతీ యువకులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ మాట్లాడుతూ రన్ మిషన్ పేరు నిరుద్యోగులకు కేంద్ర రాష్ట్ర పోలీసు. బలగాలుకు సంబంధించిన ఫిజికల్ ఫిట్నెస్ లో శిక్షణ కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. అనేక మంది మన చీపురుపల్లి నుండి కేంద్ర బలగాలలో దేశం కోసం ఇంతవరకు 136 మంది సెలెక్ట్ అయినారని హేమంత్ తెలిపారు. చిగురుపల్లి నియోజకవర్గ పరిధిలో గల అర్హులైన అభ్యర్థులందరికీ ఎస్ఎస్‌సి అగ్నిపథ, రాష్ట్ర కానిస్టేబుల్ సెలెక్ట్ అయినా నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగు తుందని, లాగ్ జంప్, హై జంప్ ఏర్పాటు చేయడం జరిగింది. శిక్షణ కు సంబంధించిన పరికరాలు కూడా వున్నాయని హేమంత్ వివరించారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కోచ్ బీ.నవీన్, వై.లక్ష్మణరావు, ప్రసాద్ సురేష్, నాగరాజు, ఆశయ రమణ చిలకయ్య, నిరుద్యోగ యువత విద్యార్థి వెంకటేష్ పాల్గొన్నారు.

మూణ్ణాళ్ళ ముచ్చటేనా?

విశాలాంధ్ర -గజవతినగరం: గజపతినగరంలో జాతీయ రహదారి విస్తరణ పనులతో పాటు రెండు రోడ్ల మధ్య డివైడర్ ను నిర్మించారు. అంతవరకు బాగానే ఉంది. అయితే డివైడర్ కు ఇరువైపులా వీధిలైట్లు ఏర్పాటు చేశారు దాంతోపాటు నాలుగు రోడ్ల జంక్షన్లో ఫ్లెడ్ లైట్లు ఏర్పాటుచేశారు. ఈ లైట్ల వల్ల ఈ జంక్షన్లో బాట సారులతోపాటు వాహనాల రాకపోకల వారికి ఎంతో ఉపయోగపడేది అయితే గత పది రోజులుగా ఈ లైట్లు ఆగిపోయాయి. అసలు ఈ లైట్లు ఎందుకు ఆగిపోయాయో అన్న విషయం చెప్పడానికి ఏ అధికారి కూడా ముందుకు రావడం లేదు పంచాయితీ, విద్యుత్ శాఖ అధికారులతో సంప్రదించడం అంటే మీరు ఎవరు అందుబాటులో లేరు ఈ విషయంపై జిల్లా స్థాయి విద్యుత్, పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకుంటే ప్రజలకు వాహనదారులకు న్యాయం చేసిన వారు అవుతారు.

ప్లాస్టిక్ రహిత బొబ్బిలికై ప్రజలు వ్యాపారులు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంల ప్లాస్టిక్ రహిత బొబ్బిలి కోసం అన్ని వర్గాల వ్యాపా రులు ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పిలుపునిచ్చారు.మంగళవారం వార్డు సచివాలయాల వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలతో, రూట్ సూపర్వైజర్లతో మరియు పబ్లిక్ హెల్త్ మేస్త్రీలతో కమిషనర్ లాలం రామలక్ష్మి అధ్యక్షతన పురపాలక సంఘ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు .ప్రతిరోజు వారి వారి వార్డులలో కచ్చితంగా డ్రెయిన్ డీసిల్టేషన్ జరగాలని ఆదేశించారు. రోడ్డు పక్కన ఉన్న హీప్ లను తొలగించి వర్షం నీరు కాలువలోకి ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, గార్బేజ్ వలనరబుల్ పాయింట్లను గుర్తించి ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు, ప్రతిరోజు ప్లాస్టిక్ వాడుతున్న మరియు అమ్ముతున్న వారిపై రైడ్లు నిర్వహించి జరిమానాలు విధించాలని ఆదేశించారు, ఆన్ సైట్ కంపోస్టింగ్ నిర్వహిస్తున్న అపార్ట్మెంట్లు మరియు గ్రూప్ హౌస్ లను ఎప్పటికప్పుడు సందర్శించి వారికి సూచనలు జారీ చేసి ఎరువు తయారయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, ప్రజల వద్ద నుండి మరియు సోషల్ మీడియా ద్వారా వస్తున్న ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.